క్లుప్తంగా

అధినేతతో భేటీ



దేవరపల్లి: మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, గోపాలపురం నియోజకవర్గ సమన్వయకర్త తానేటి వనిత బుధవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నిర్వహిస్తున్న పార్టీ కార్యక్రమాలు, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన 'బాబూ ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమాలను ఆమె వివరించారు.

నేడు వైఎస్సార్ సీపీ పట్టణ విస్తృతస్థాయి సమావేశం

నిడదవోలు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ పట్టణ విస్తృతస్థాయి సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి జి.శ్రీనివాస్‌నాయుడు హాజరవుతారని తెలిపారు. నిడదవోలు కాపు కల్యాణ మండపంలో మధ్యాహ్నం 3 గంటలకు ఈసమావేశం ప్రారంభమవుతుందన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, పార్టీ అనుబంధ విభాగాల కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని బుధవారం ఓ ప్రకటనలో ఆయన కోరారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం



గజ్జరం పంచాయతీ వద్ద సచివాలయ ఉద్యోగులను సత్కరిస్తున్న సర్పంచ్, కార్యదర్శి

తాళ్లపూడి: గజ్జరం సచివాలయంలో ఇప్పటి వరకు పనిచేసి బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులకు సర్పంచ్ గండి రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. సర్పంచ్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్ ఉద్యోగులకు శాలువా కప్పి, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. సచివాలయ ఉద్యోగులు భారతి, మణికుమార్, కరుణ, సుధీర్, పద్మ పాల్గొన్నారు.

గ్రామాల్లో భూముల రీ సర్వేకు సహకరించాలి

తాళ్లపూడి: మండలంలో రీసర్వే ఫేజ్ 3 కార్యక్రమాన్ని అమలుకు చర్యలు చేపట్టామని తహసీల్దార్ లక్ష్మి లావణ్య తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్నదేవరపేట, తాళ్లపూడి, కుకునూరు, వేగేశ్వరపురం, పెద్దేవం, మలకపల్లిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. దీనిలో రెవెన్యూ రికార్డులు, భూమి కొలతల్లో వ్యత్యాసాలను గుర్తించి సరిచేయడం, గ్రామ సరిహద్దులు నిర్ధారించడం, రైతు వారీ భూములను సర్వే చేసి రీ సర్వే రికార్డులు తయారు చేస్తామని పేర్కొన్నారు. ఆయా గ్రామంలోని ప్రజలు, రైతులందరూ గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్‌కు సహకరించాలని కోరారు.

రేపు విద్యుత్‌కు సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: మండలంలోని అయ్యవరం విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఆగస్టు 1న అయ్యవరం గ్రామంలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

దేవరపల్లి: మండలంలో విద్యుత్ సెక్షన్ పరిధిలోని దేవరపల్లి, గొల్లగూడెం, ధుమంతునిగూడెం, కొత్తగూడెం గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ ఎన్.నారాయణ అప్పారావు బుధవారం తెలిపారు. 33/11 కేవీ పరిధిలో 11కేవీ దేవరపల్లి టౌన్ ఫీడర్, మార్కెట్ ఫీడర్ నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు, రామన్నపాలెం ఫీడర్‌పై ఆర్డీఎస్ పనుల నిమిత్తం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు.

నిలకడగా వర్జీనియా పొగాకు ధరలు

గోపాలపురం: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన పొగాకు కొనుగోళ్ల ధరలు నిలకడగా సాగాయి. వాదాలకుంట, వెదుళ్లకుంట గ్రామాలకు చెందిన 1,199 బేళ్లు రాగా అందులో 1,088 కొనుగోలు చేయగా మిగిలిన 111 బేళ్లు వెనుదిరిగినట్టు వేలం నిర్వహణాధికారి కేవల్ రామ్ మీనా తెలిపారు. అత్యధిక ధర రూ.370, అత్యల్పం రూ.200, సరాసరి ధర రూ.349.46 లభించినట్లు తెలిపారు. వేలంలో 14 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

పడకేసిన పారిశుధ్యం

- గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంచాయతీలు
- కొరవడిన మండల అధికారుల పర్యవేక్షణ
- షెడ్లు, ట్రై సైకిళ్లు, ఆటోలు, డస్ట్‌బిన్లకు ఖర్చు రూ.1.67 కోట్లు

పెరవలి: గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా పల్లెల్లో నేడు ఎక్కడ చూసినా అపరిశుభ్రత నెలకొని వ్యాధులు ప్రబలుతున్నాయి. పారిశుధ్య నిర్వహణ కోసం కార్మికుల కొరతతో పాటు, చెత్తను పోగుచేసి వాటి నుంచి సంపద సృష్టించటానికి కావలసిన ఆయా కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో సంపూర్ణ పారిశుధ్య లక్ష్యం నెరవేరడం లేదు.

రోడ్ల పక్కన చెత్త పేరుకుపోయి దుర్వాసన వ్యాప్తి

వాతావరణ మార్పులతో నెల రోజులుగా అధిక ఎండలు, లేక వర్షాలు కురవటంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడ వదలివేయడంతో వర్షాలకు తడిసిన చెత్త నుంచి తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో గ్రామాలు కంపుకొడుతున్నాయి. పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టకపోవటంతో రోడ్లపై చెత్తాచెదారం చేరి ప్రయాణీకులు, బాటసారులు, గృహవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జ్వరాలతో బాధపడుతున్న ప్రజలు

వాతావరణ మార్పుల వలన అధిక ఎండలు, వర్షాలతో చెత్తాచెదారం కుళ్లి దుర్గంధం వెదజల్లడంతో దోమలు వృద్ధి చెందడంతో వాటి ద్వారా గ్రామాల్లో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. అందుకు పీహెచ్‌సీల్లో పెరుగుతున్న రోగుల సంఖ్యే నిదర్శనం. నెల రోజుల క్రితం వరకు పీహెచ్‌లకు రోజుకి 25 నుంచి 40 మంది వస్తే 10 రోజులుగా ఆ సంఖ్య 50 నుంచి 100 మందికి పైగా చేరింది. కానూరు పీహెచ్‌సీకి వైద్య కోసం గతంలో 30 నుంచి 50 మంది వస్తే ఇప్పుడు 80 నుంచి 100 మంది వస్తున్నారు. పెరవలి పీహెచ్‌సీకి గతంలో 20 నుంచి 30 మంది వస్తే నేడు 30 నుంచి 50 మంది వస్తున్నారు. దీనిపై పీహెచ్‌సీ వైద్యుడు హేమరాజు మాట్లాడుతూ వర్షాకాలంలో సాధారణంగా ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతుందన్నారు.జ్వరం, జలుబు, దగ్గు వంటి కారణాలతో చాలా మంది ఆస్పత్రికి వస్తున్నారని వివరించారు.



కాకరపర్రులో నిరుపయోగంగా సంపద కేంద్రం

సంపద కేంద్రాలకు, ట్రై సైకిళ్లు, ఆటోలకు ఖర్చు

పెరవలి మండలంలో 18 గ్రామాల్లో 18 సంపద కేంద్రాలకు షెడ్లు నిర్మించారు. వీటికి గ్రామ స్థాయిని బట్టి రూ.5 నుంచి రూ.8 లక్షల వరకు ఖర్చు చేసి నిర్మించగా 18 షెడ్లకు రూ.1.17 కోట్లు ఖర్చు చేశారు. ట్రై సైకిళ్లు ఒక్కొక్కటి రూ.31,400 చొప్పున 69 ట్రై సైకిళ్లు పంపిణీ చేయగా వీటి విలువ రూ.22.66 లక్షలు, 24 ఆటోలకు రూ.24 లక్షలు, డస్ట్‌బిన్లు 588 పంపిణీ చేయగా వీటి విలువ రూ.3.58 లక్షలు పారిశుధ్య నిర్వహణ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.1.68 కోట్లు ఖర్చు చేసింది. ఇంత చేసినా ఇప్పటి వరకు కొన్ని గ్రామాల్లో వీటిని వినియోగంలోకి తీసుకురాలేదంటే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



సీతారామపురంలో ఇళ్ల పక్కనే పేరుకుపోయిన చెత్త



పెరవలిలో కాలువ, ఇళ్ల వద్ద అపరిశుభ్రత



వెంకట్రాయపురంలో రోడ్డు పక్కన చెత్త డంపింగ్



పెరవలిలో వంతెన వద్ద చెత్త, ఖాళీ కొబ్బరి బొండాలు

చెత్త సేకరణపై నిర్లక్ష్యం



ఏ గ్రామంలోకి వెళ్లాలన్నా ముందుగా చెత్తకుప్పలను దాటాల్సి వస్తోంది. గ్రామాల్లో చెత్తా చెదారం ఎక్కడికక్కడ పేరుకుపోయింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు వచ్చినప్పుడు మాత్రమే గ్రామాలను శుభ్రం చేస్తున్నారు. ఇండ్ల దగ్గర చెత్తను సేకరించడం లేదు. ఒకవేళ సేకరించినా రోడ్లు లేక కాలువ గట్లు పక్కన డంప్ చేస్తున్నారు.

–పల్లేటి రవి, ఖండవల్లి

చెత్త సేకరణ కొనసాగుతోంది



గ్రామాల్లో చెత్త సేకరణ కొనసాగుతోంది. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. రోడ్ల పక్కన చెత్త ఉంటే శుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను, సచివాలయ సిబ్బందిని ఆదేశిస్తాం. వర్షాలు తగ్గిన తరువాత అన్ని గ్రామాల్లో చెత్తను తొలగించే పని చేపడతాం.

– సీహెచ్ వెంకటరమణ, ఈఓపీఆర్డీ, ఇన్‌చార్జి ఎంపీడీఓ, పెరవలి

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించొద్దు



పెరవలిలో ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెరవలి: పాఠశాలల్లో ఉపాధ్యాయులు స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో పిల్లలకు పాఠాలు చెప్పే పరిస్థితి లేదని, దీనికి కారణం ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించటమేనని ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి అన్నారు. పెరవలి మండలంలో పెరవలి, ముక్కామల, ఖండవల్లి, కానూరు, కాకరపర్రు, మల్లేశ్వరంలోని ఉన్నత, పాఠశాలలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు తెరిచి రెండు నెలలువుతున్నా విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన జరగకుండా ప్రభుత్వం యోగాడే, పేరెంట్స్ మీటింగ్, వాటి వివరాలు ఆన్‌లైన్ నమోదు పనులు చేయించిందని అన్నారు. నేటికీ ఉపాధ్యాయులకు డీఏ, పీఆర్‌సీ, సరండర్ లీవులు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకులు వెంకటరమణ, యం శేఖర్ రాజు, డివిఎస్ఆర్, తారా కృష్ణ, వీఎస్‌వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యే శక్తివంతమైన ఆయుధం



సెయింట్ క్లారెట్స్ నూతన భవన ప్రారంభంలో పాల్గొన్న క్రైస్తవ పీఠాధిపతులు, విద్యార్థులు

నల్లజర్ల: సమాజాన్ని మేల్కొలపడానికి విద్యే ఒక శక్తివంతమైన ఆయుధమని ఏలూరు ఆర్‌సీఎం పీఠాధిపతి బిషప్ జయరావు పోలిమేర, బిషప్ బాల అన్నారు. నల్లజర్ల సెయింట్స్ క్లారెట్స్ స్కూల్లో రూ.3.50 కోట్లతో నిర్మించిన నూతన భవన సముదాయాన్ని బుధవారం సాయంత్రం వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యపై ఆసక్తి కలిగి కష్టపడి చదివితే ఉన్నత హోదాతో పాటు సమాజంలో గౌరవ మర్యాదలు కలుగుతాయన్నారు. బెంగుళూరుకు చెందిన సెయింట్ క్లారెట్స్ సంస్థల మేనేజరు ఫాదర్ సాబు జార్జి మాట్లాడుతూ తమ సంస్థలో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సభస్టిన్, ప్రిన్సిపాల్ రవికుమార్ రెడ్డి, ఫాదర్‌ఆంటోనీ, ఫాదర్ జయరాజు, ఎంఈఓలు వై.సత్యనారాయణ, భగవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

పెరవలి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో విఫలమైందని వైఎస్సార్ విద్యార్థి విభాగం ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ జిల్లెల రాజేష్ ఆరోపించారు. పెరవలి మండలంలోని కానూరు, ఖండవల్లి వసతి గృహాలను బుధవారం ఆయన పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని, మరుగుదొడ్లు బాగోలేవని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం ఇవ్వవలసిన మెస్, కాస్మోటిక్స్ సొమ్ములు విడదల చేయటం లేదని, నాణ్యమైన ఆహారం అందించటం లేదని ఆరోపించారు. అపరిశుభ్రమైన వాతావరణంలో వసతి గృహాలను నిర్వహించటం దారుణమని అన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రొట్టే నవీన్ కుమార్, నాయకులు మెల్లిమి పండు, అంజి, సుభాష్, విస్సు పాల్గొన్నారు.

అవసరానికి మించి ఎరువులు వాడవద్దు



దమ్మెన్నులో నానో యూరియా ప్రయోజనాలు వివరిస్తున్న ఏవో రాజారావు

ఉండ్రాజవరం: రైతులు వరి సాగులో అవసరానికి మించి ఎరువులను వినియోగించవద్దని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు తెలిపారు. మండలంలో దమ్మెన్ను, ఉండ్రాజవరంలో బుధవారం అయన ఉద్యాన శాఖాధికారి డి.సుధీర్‌తో కలసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నానో టెక్నాలజీ ద్వారా మార్కెట్‌లో లభ్యమవుతున్న నానో యూరియా, డీఏపీలను వాడటం ద్వారా సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. ఎరువులకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులను వినియోగించాలన్నారు. ఈకార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది లోకేశ్వరి, సురేష్, గ్రేస్, హైమా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి



సమిశ్రగూడెం పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు రూరల్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలించేందుకు పీహెచ్‌సీ సిబ్బంది బాధ్యతతో పనిచేయాలని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. మండలంలోని సమిశ్రగూడెంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. పీహెచ్‌సీని రాత్రివేళల్లో మూసివేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఇకపై డాక్టర్లతో పాటు వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది కొరత ఉందని పీహెచ్‌సీ వైద్యులు ఎం.శివాజీ, ఎం.శ్రీనిధిలో మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో పీ4 కార్యక్రమంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, ఎంపీడీఓ జగన్నాథరావు, కొవ్వూరు డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సంధ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

ఉండ్రాజవరం: సత్యవాడ గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను బుధవారం ఎంపీడీవో వి.రామారావు ఆకస్మిక తనిఖీ చేశారు. తెల్లవారుజాయున పంచాయతీ కార్యదర్శి జి.ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులు, రోడ్డు పక్కన పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపునకు కలుపు మందును పిచికారీ తదితర కార్యక్రమాలు పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణను ఆయన పరిశీలించారు.

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

- మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- తిమ్మరాజుపాలెంలో వైఎస్సార్ సీపీ మండలస్థాయి సమావేశం



తిమ్మరాజుపాలెంలో క్యూఆర్ కోడ్ పోస్టర్లతో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు

నిడదవోలు రూరల్: ప్రజలకు సూపర్ సిక్స్‌తో సహా 140కి పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబుతో పాటు కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పిలుపునిచ్చారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో తిరుచానూరు పద్మావతి కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు అధ్యక్షతన బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ నిడదవోలు మండలస్థాయి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ కూటమి నాయకులు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో ఇంటింటికీ తిరిగి ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో హామీలన్నీ అమలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులకు లబ్ధిచేకూర్చామని ఆయన గుర్తు చేశారు.ఎ సూపర్ సిక్స్ పథకాలు పూర్తిగా అమలు చేయలేమంటూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక్క పథకం పూర్తిగా అమలుచేయకుండా రాష్ట్ర ప్రజలను మోసం చేశారని విమర్శించారు. చంద్రబాబు అబద్ధాల కోరని ధ్వజమెత్తారు. నిడదవోలు అభివృద్ధికి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో సహకరించారన్నారు. నాన్న జీఎస్ రావు, తాను ఎప్పుడూ కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటామని, కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు ఎవరూ భయపడొద్దన్నారు. 2029లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉంటూ కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను విమర్శించే స్థాయి జనసేన పార్టీ నేతలకు లేదని అన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ కానుబోయిన ప్రభావతి, ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగన పోలయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకవల్లి శ్రీహరి, యాళ్ల రామారావు, మానుకొండ చంద్రబాబు, షేక్ ఖాన్‌భాషా, కొండపల్లి శ్రీనివాస్, గజ్జరపు శ్రీరమేష్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నిడదవోలు : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని బుధవారం ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

దేవరపల్లి: స్థానికంగా గల మూడు గ్రామ సచివాలయాల ఉద్యోగులు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేవీకే దుర్గారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బదిలీపై వచ్చిన పలువురు ఉద్యోగులు ఎంపీపీని కలిశారు. ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వహించి ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆయన సూచించారు. గ్రామ సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలని ఆయన తెలిపారు.

ఆసుపత్రిలో అన్నసమారాధన

నిడదవోలు : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సత్యసాయి నిత్యాన్నదాన సేవా పథకం ద్వారా రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోగులు, వారి సహాయకులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మీసాల శివరామ హరి ప్రసాద్, దారపురెడ్డి ప్రతాప్, గుంటిపల్లి సత్యసాయి, పొన్నా సుబ్రహ్మణ్యం, సానేపు సుబ్బారావు, గోపిరెడ్డి శ్రీనివాస్, సత్య సాయి నిత్యాన్నదాన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే తలారి పరామర్శ



చిడిపిలో అక్కాబత్తుల చిన్నబ్బులు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి తదితరులు

తాళ్లపూడి(కొవ్వూరు): ఇటీవల మండలం పరిధిలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ తలారి వెంకట్రావు బుధవారం పరామర్శించారు. చిడిపి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు అక్కాబత్తుల చిన్నబ్బులు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించి మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. గజ్జరం గ్రామానికి చెందిన పూలపల్లి సుశీలమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండి రాంబాబు, నాయకులు పామేర్ల నగేష్, ఎల్లిన శ్రీను, చిక్కాల మహేష్, దాకే రాజు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



కొవ్వూరులో ప్రమాణస్వీకారం చేస్తున్న లయన్స్ క్లబ్‌ల నూతన కార్యవర్గ నాయకులు

తాళ్లపూడి(కొవ్వూరు): లయన్స్ క్లబ్ ద్వారా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలను చేయాలని పలువురు సూచించారు. కొవ్వూరులోని లిటరరీ క్లబ్‌లో బుధవారం కొవ్వూరు, తాళ్లపూడి, దేవరపల్లి లయన్స్ క్లబ్‌ల నూతన కార్యవర్గ అధ్యక్షులు, సెక్రటరీలు, ట్రెజరర్లు ప్రమాణస్వీకారం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జిల్లా లయన్స్ క్లబ్ ప్రముఖుల సమక్షంలో కొవ్వూరు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా పెనుమాక జయరాజు, తాళ్లపూడి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా నామన పరమేశ్వరరావు, దేవరపల్లి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా పెందుర్తి రామరహిత ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు, మలకపల్లి సొసైటీ అధ్యక్షుడు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, సూరపనేని చిన్ని పాల్గొన్నారు.

రక్త నిధికి తోడ్పాటు అభినందనీయం



గోపాలపురంలో రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డాక్టర్ జక్కంపూడి రాజేశ్వరి

గోపాలపురం: మాజీ మంత్రి దివంగత జక్కంపూడి రామ్మోహన్‌రావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన రక్త నిధికి ఒక్కరోజులో 127 మంది రక్త దానం చేయడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజేశ్వరి అన్నారు. స్థానిక శర్వాణి హైస్కూల్లో బుధవారం మండల మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె సందర్శించారు. మానవత సంస్థ చేపడుతున్న సేవలను కొనియాడారు. ఎంతో మంది అభాగ్యులకు అండగా ఉంటున్న గోపాలపురం మండల మానవత సంస్థ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, అధ్యక్షుడు రాపాక ఫణికిషోర్, జిల్లా రక్తనిధి డైరెక్టర్ జోడాల వెంకటేశ్వరరావు, మండల డైరెక్టర్ నెల్లి చంద్రశేఖర్, సభ్యులను ఆమె ప్రశంసించారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు మానవత సంస్థ ద్వారా ప్రశంసాపత్రాలు అందజేశారు.